

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## రాదే చెలీ

**పాపని** జాగ్రత్తగా గేట్‌లోంచి లోపలకి పంపించి బైక్ వైపు వెళ్ళబోతున్న ఉత్తర చటుక్కున ఆగి వెనక్కి తిరిగి చూసింది. అవును. అతనే శైలేంద్ర! ఆమె చటుక్కున పక్కనే ఉన్న కారు వెనక్కి వెళ్ళి అతన్ని గమనించింది. శైలేంద్ర నాలుగేళ్ళ బాబుని చెయ్యిపట్టుకుని తీసుకెళ్తున్నాడు. స్కూల్ గేట్‌లోంచి వాడిని లోపలకి పంపి, వాచ్‌మేన్‌తో ఏదో చెప్పి వెను తిరిగాడు. మనిషిలోమార్పు లేకపోవడంతో తేలిగ్గా గుర్తుపట్టింది. అతను ఎటూ చూడకుండా తనకారు దగ్గరకి నడిచి, కారెక్కి స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు.

ఉత్తర పళ్ళు పటపట కొరికింది. దుర్మార్గుడు. వాడిని చూస్తుంటే హాయిగా జీవిస్తున్నట్లున్నాడు. ఫిట్‌గా ఉన్నాడు. ఎస్‌యువి మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు. వాడి కొడుకు కూడా రీతూ పాప వయసే. ముద్దుగా ఉన్నాడు.

ఆమె కోపంతో ధుమధుమలాడుతూ బైక్ ఎక్కింది. సాయంత్రం ఆఫీస్‌నించి వస్తూ స్కూల్‌కి అనుబంధంగా ఉన్న డేకేర్ సెంటర్‌కి వెళ్ళి రీతూని తీసుకుని ఇంటికి వచ్చింది.

ఉదయం నించి ఉత్తర మనసు మనసులో లేదు. ఆమె హృదయం కోపంతో భగ్గుమంటోంది. ఏ పనీ చేయాలనిపించలేదు. కాని పవన్ బయటి ఫుడ్ తినడు. విసుక్కుంటూనే వంట మొదలుపెట్టింది.

"ఏంటి మూడీగా ఉన్నావు?" ఆ రాత్రి పవన్ భార్యని అడిగాడు.

"ఏంలేదు. బానే ఉన్నానే?" ఉత్తర అబద్ధమాడింది.

"లేదు. లేదు ఏదో ఉంది. నీ ఫేస్ ఈజ్ ఇండెక్స్ ఆఫ్ యువర్ మైండ్ నీ మనసులో ఆనందం ఉన్నా, దుఃఖం ఉన్నా మొహాన్ని చూస్తే తెలిసిపోతుంది. ఇప్పుడు నీకు ఎవరిమీదో కోపంగా ఉంది" పవన్ చెప్పాడు.

ఉత్తర ఉలిక్కిపడింది. మామూలు రోజుల్లో ఐతే అతని పరిశీలనా శక్తికి ముచ్చట పడేది. కాని ఇప్పుడు చిరాకు పడింది.

"ప్లీజ్ ఇంటరాగేషన్ ఆపుతావా? నా ఇష్టమొచ్చినట్లు ఉండనీవా?" కసురుకుంది.

"కోపంగా ఉండాలని ఇష్టమా?" పవన్ ఆశ్చర్యపోయాడు.

"అవును. ఇవాళ కోపంగా ఉంటాను. రేపు ఏడుస్తాను. సరా?" అరిచి పక్కకి తిరిగి పడుకుంది.

"ఈ రోజు రీతూని దింపుతావా స్కూల్ దగ్గర?" పవన్‌కి కాఫీ గ్లాస్ ఇస్తూ అడిగింది.

"నో. వే. నీకు తెలుసుగా నాకు టైం సరిపోదని. మళ్ళీ అడుగుతావేంటీ?" పవన్ విస్మయంగా అడిగాడు.

"నాకూ కుదరడంలేదు. ఆటో మాట్లాడతా" చెప్పింది.

"నీ ఇష్టం."

ఉత్తర రీతూతో స్కూల్ ముందు ఆగి, పాపని గేట్‌లోంచి లోపలికి పంపించి వెంటనే వెళ్ళిపోకుండా వేచి చూసింది. ఎర్ర రంగు ఎస్‌యువి వచ్చింది. శైలేంద్ర కొడుకు చెయ్యి పట్టుకుని మాటలు చెప్తూ స్కూల్ గేట్ దగ్గరకి వచ్చి వాడిని లోపలకి పంపించాడు. ఉత్తర కోపంగా చూస్తూండిపోయింది. శైలేంద్ర లోపలికి వెళ్తున్న కొడుకుని ఒక్క క్షణం ఆపి, జేబులోంచి కర్చీఫ్ తీసి వాడి ముక్కు తుడిచి వాడిని బుగ్గమీద గాఢంగా ముద్దుపెట్టుకుని విడవలేనట్లుగా వెనక్కి తిరిగి చూస్తూ కారు దగ్గరకి వచ్చాడు.

ఉత్తర బైక్ స్టార్ట్ చేసింది. ఆమె మనసు వేదనగా ఉంది. ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదు. కాని తన మనసులో ఉన్న అక్కసంతా వెళ్ళగక్కాలని ఉంది.

సాయంత్రం రీతూని తీసుకురావడానికి డే కేర్‌కి వెళ్ళింది. శైలేంద్ర కారు అప్పటికే అక్కడ ఆగి వుంది. ఉత్తర తప్పదన్నట్లుగా లోపలికి వెళ్ళింది.

శైలేంద్ర బాబుని ఎత్తుకుని వస్తున్నాడు. పక్కనే అతని భార్య. తెల్ల చీరలో దేవకన్యలా ఉంది. పొడవైన జుట్టుని వదిలేసింది. లైట్ మేకప్‌తో ఆమె మొహం వెలిగిపోతోంది. వాళ్ళు ముగ్గురూ ఈ లోకంలో తాము మాత్రమే ఉన్నాం అన్నట్లుగా చుట్టుపక్కల మనుషుల్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయారు.

ఇంటికి వచ్చాక ఉత్తర అద్దం ముందు నిలబడి తనని తాను చూసుకుంది.

"ప్చ్. ఏవరేజ్ మొహం. గొణుక్కుంది. అప్రయత్నంగా శైలేంద్ర భార్యతో పోల్చుకుంది.

'ఛ' ఆమె దేవకన్యలా ఉంటే, తను యమకింకరిలా ఉంది. దిగులుగా అనుకుంది.

వాడి కొడుకు కూడా ముద్దులు మూటకట్టేలా ఉంటాడు. ఉత్తర ఉక్రోషాన్ని ఆపుకోలేకపోయింది.

ఫోన్ తీసుకుని ఓ నంబర్‌కి వాట్సప్ కాల్ చేసింది. నాలుగుసార్లు మోగాక అవతలి వైపు ఆన్సర్ చేసారు.

"ఏంటే తల్లీ. అంత కొంపలేం అంటుకుపోయాయి? మాకింకా తెల్లారలేదు తెలుసా?" అవతలి నించి ఓ కంఠం నిద్రమత్తుతో అడిగింది.

"ఓ అరగంట ముందు లేస్తే నష్టం లేదు కాని అర్జెంట్‌గా బెడ్రూంలోంచి బయటికిరా. నీతో మాట్లాడాలి" ఉత్తర కసిరింది.

అరనిమిషం తర్వాత వినిపించింది.

"చెప్పు"

"నీకు శైలేంద్ర గుర్తున్నాడా?" ఉత్తర అడిగింది.

"శైలే.. నీ దేవదాస్ కదూ?"

"అవును వాడే"

"ఇప్పుడెందుకు గుర్తొచ్చాడు అకస్మాత్తుగా, కొంపదీసి పోయాడా?"

"పోతే నా అంత సంతోషించేవాళ్ళెవరూ ఉండరు" ఉత్తర కసిగా చెప్పింది.

"ఇప్పుడే నిద్రలేచానా? అసలు ఏమీ అర్థం కావడంలేదు. కొంచెం వివరంగా చెప్తావా ప్లీజ్."

"నువ్వు చెప్పవే దివ్యా. వాడు నాలుగేళ్ళు నా వెంటపడ్డాడా లేదా?"

"పడ్డాడు. నీ ఆరాధకుడు కదా. నీ వెనకే తిరిగాడు. మనం ఏ సినిమాకి వెళ్ళినా వెనక సీట్లో తయార్. ఎక్కడికి వెళ్ళినా నీకు బాడీగార్డ్‌లా ఉండేవాడు. హచ్ డాగ్ అనే వాళ్ళం కదా?"

"కదా? నన్ను ప్రేమించానన్నాడు. నా వెంట పడ్డాడు. నేను 'నో' అంటే చచ్చిపోతానన్నాడు. నా వెనక కుక్కపిల్లలా తిరిగేవాడు."

"ఇప్పుడు వాడి గురించి ఎందుకడుగుతున్నావ్?"

"వాడు నేను రిజెక్ట్ చేసానన్న బాధ లేకుండా, వెంటనే ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడే వాడి కొడుకుది రీతూ వయసే. అంటే దరిద్రుడు వెంటనే ఏ మాత్రం బాధపడకుండా నేను నో అనగానే నాకంటే అందమైన దేవకన్యలాంటి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. వాడు దేవదాసులా గడ్డాలు పెంచి కెరీర్ లేకుండా తిరుగుతున్నాడేమో అనుకున్నా ఇంతకాలం. హేపీగా సెటిలయ్యాడు. వెధవ ఎస్ యు విలో పెళ్ళాంతో తిరుగుతున్నాడు. వాడిది నిజమైన ప్రేమ అనుకున్నా. కానీ కాదు" ఉత్తర కళ్ళవెంట నీళ్ళు కారుతూండగా ఉక్రోషంగా చెప్పింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments